నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 16 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI




మహిళా సంఘాలకు మోడల్ రుణాల చెక్కు అందజేస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్, ఎమ్మెల్సీ తీన్మార్ మలన్న, కలెక్టర్ జెండగే

# యాదాద్రిని అగ్రగామిగా నిలుపుదాం

## కలిసికట్టుగా పనిచేసి జిల్లా అభివృద్ధికి పాటుపడుదాం

- త్వరలో గంధమల్ల రిజర్వాయర్ పనులు ప్రారంభం
- అభివృద్ధి, సంక్షేమంలో దేశానికి తలమానికంగా తెలంగాణ
- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- భువనగిరి జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ
- పాల్గొన్న ఎంపీ చామల, ఎమ్మెల్సీ మల్లన్న, ఎమ్మెల్యే కుంభం
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు
- గొప్పగా సాగిన వివిధ విభాగాల శకటాల ప్రదర్శన
- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు పంపిణీ
- ఉద్యమకారులను ఆహ్వానించలేదంటూ నిరసన





భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో జెండా ఎగురవేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ హనుమంతు కె. జెండగే, డీసీపీ రాజేశ్ చంద్ర తదితరులు



విద్యార్థుల నృత్యాలు

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ) : అన్ని వర్గాల ప్రజలు కలిసిగట్టుగా పనిచేసి యాదాద్రి భువనగిరి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుదామని, ఆ దిశలో అందరం అంకితమై శ్రమిస్తూ రాష్ట్రంలోనే జిల్లాను అగ్రగామిగా నిలుపుదామని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గంధమల్ల రిజర్వాయర్ పనులను త్వరలో ప్రారంభించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదని చెప్పారు. 78వ భారత స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని గురువారం భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రం శరవేగంతో అభివృద్ధి చెందుతూ దేశానికి తలమానికంగా ఉంటున్నదని అన్నారు. మహాలక్ష్మి పథక కింద ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సబ్సిడీ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. గృహజ్యోతి పథకంలో ఇప్పటి వరకు రూ. 19.89 లక్షల విలువైన విద్యుత్‌ను 1,41,810 మంది వినియోగదారులకు ఇస్తున్నట్లు తెలిపారు. రైతు రుణమాఫీ కింద తొలి విడుతలో 36,047 మంది రైతులకు రూ. 198.11 కోట్లు, రెండో దఫాలో 17,991 మంది రైతులకు రూ. 176.12 కోట్లు మాఫీ చేసినట్లు చెప్పారు. మూడో దశను గురువారం నుంచి అమలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 1,31,185 మంది రైతులకు బీమా చేశారని, ఈ పథకం' ద్వారా జిల్లాలో గతేడాది నుంచి మరణించిన 535 మంది రైతుల కుటుంబాలకు రూ. 26.75 కోట్లను వారి నామినీ ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు పని కల్పించడంలో 131శాతం లక్ష్యాన్ని సాధించి జిల్లా రాష్ట్రంలో తొలి స్థానంలో నిలిచిందన్నారు. అనంతరం స్వాతంత్ర్య సమర యోధుడు మన్నె గోపాల్ రెడ్డిని సన్మానించారు.



యాదగిరిగుట్టలో జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

### సాంస్కృతిక కార్యక్రమాలు.. శకటాల ప్రదర్శన

స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. డ్రగ్స్, ఫోన్ల వల్ల కలిగే అనర్థాలు, ర్యాష్ డ్రైవింగ్‌పై అవగాహన, చైతన్యం కల్పిస్తూ బీచ్‌మహల్లా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమం అందరినీ ఆలోచింపజేసింది. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, జిల్లా గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్య, విద్య, అటవీ, ఆర్టీసీ, అగ్నిమాపక, రెడ్స్ శాఖలు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శన గొప్పగా సాగింది. శకటాల ప్రదర్శనలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ మొదటి బహుమతి, వ్యవసాయ శాఖ రెండో బహుమతి, విద్యా శాఖ మూడో బహుమతి అందుకున్నాయి. ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, ఇంటింటా ఇన్నోవేటర్, రెడ్స్, చేనేత జౌళిశాఖ, పశు సంవర్ధక, నీటి పారుదల, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖలు, లీడ్ బ్యాంక్ అమలుపరుస్తున్న పథకాలపై స్టాల్స్ రూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా రూ. 164 కోట్ల విలువైన మహిళా సంఘాల బ్యాంక్ లింకేజీ రుణాలు, రూ. 47 కోట్ల విలువైన మెప్మా సంఘాల రుణాలు, రూ. 11 కోట్ల స్త్రీ నిధి రుణాల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో అగ్రభాగాన నిలిచిన తుక్కాపూర్, నర్సాపూర్ గ్రామాలు బహుమతులు అందుకున్నాయి. ఇంటింటా ఇన్నోవేటర్‌లో భాగంగా నూతన ఆవిష్కర్తలకు మెమెంటోలు అందించారు.

### ఉద్యమకారులను ఆహ్వానించ లేదంటూ నిరసన..

వేదికపై చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రసంగిస్తుండగా తెలంగాణ ఉద్యమకారుడు పూస శ్రీనివాస్ ఒక్కసారిగా స్టేజీపైకి దూసుకొచ్చారు. తెలంగాణ ఉద్యమకారులను ఆహ్వానించకుండా అవమానించారంటూ నిరసన వ్యక్తం చేశారు. చైర్మన్ దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేశారు. ఇంతలోనే అధికారులు, పోలీసులు జోక్యం చేసుకుని అడ్డుకున్నారు. శ్రీనివాస్‌ను స్టేజీ కిందకు తీసుకొచ్చి శాంతింపజేసే ప్రయత్నం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉద్యమకారులను ఆహ్వానించకపోవడం ఏంటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



పూస శ్రీనివాస్‌ను స్టేజీ కిందకి లాక్కెళ్తున్న పోలీసులు

### ప్రశంస పత్రాలు పంపిణీ..

ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. జిల్లా ఉత్తమ అధికారులుగా సీపీఓ వెంకటేశ్వర్లు, అడిషనల్ డీఆర్‌డీఓ సురేష్, జిల్లా ఉపాధి కల్పనాధికారి సాహితీ పరాంకుశం ప్రశంశా పత్రాలను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. కలెక్టరేట్ ఏఓ జగన్‌మోహన్ ప్రసాద్, సూపరింటెండెంట్లు రామారావు, పార్థసింహారెడ్డి, నాయబ్ తాసీల్దార్ సురేశ్ బాబు, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, ఏడీ ఎంసీ శ్యామల తదితరులు ఉత్తమ ప్రశంసా పత్రాలను తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్ (తీన్మార్ మల్లన్న), ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కలెక్టరు హనుమంత్ కె.జెండగే, డీసీపీ రాజేశ్ చంద్ర, అదనపు కలెక్టరు పి.బెన్షాలోమ్, కె.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి తదితరులు

### బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో..

భువనగిరి అర్బన్, ఆగస్టు 15 : భువనగిరిలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితో కలిసి జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జడల అమరేందర్‌గౌడ్, ఎనబోయిన ఆంజనేయులు, ఎడ్ల రాజేందర్ రెడ్డి, చింతల కిష్టయ్య, పట్టణ, మండల అధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు పాల్గొన్నారు.



పవిత్రోత్సవాల్లో భాగంగా నవకలశ స్నాపనం నిర్వహిస్తున్న అర్చకులు

# వైభవంగా పవిత్రోత్సవాలు

యాదగిరిగుట్ట, ఆగస్టు 15 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి స్వయంభూ ప్రధానాలయంలో గురువారం వార్షిక పవిత్రోత్సవాలు పాంచరాత్రాగమ శాస్త్ర రీతిలో జరిగాయి. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులకు అర్చకులు తిరుమంజనాలు నిర్వహించారు. స్వామివారికి నవకలశ స్నాపనం వైభవంగా జరిపించారు. యాగశాలలో ద్వార తోరణ పూజ, కుంభారాధన, చక్ర మండలారాధన నిర్వహించి స్వామివారికి శాంతిహోమం చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు మూల, ముక్తి మంత్రాలు, వేద మంత్ర పఠనాలతో హవన పూజలు చేశారు. స్వామివారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాల ఆభరణాలతో ఆలంకరించి 108 నూలుధారాలతో తయారు చేసిన పవిత్ర మాలలను పుణ్య జలాలతో సంప్రోక్షించి పూజలు నిర్వహించారు. సాయంత్రం విశేష హవనం, సకలదోషాల నివారణార్థం జీతంతే స్తోత్రంతో హోమం జరిపారు. అనంతరం మూర్తికుంభారాధన, పవిత్రమాలల ఆరాధనలు జరిపి పవిత్ర మాలలను కవచమూర్తులు, దివ్య విమానగోపురం మీదగల మహా సుదర్శన చక్రానికి అలంకరిచారు. సుదర్శన చక్రానికి ఆరాధన ఉపచారాలు అందించి తీర్థంతో అభిషేకం నిర్వహించారు. మూడు రోజులు పాటు కొనసాగే పవిత్రోత్సవాలకు శుక్రవారం ప్రధానాలయంలోని స్వయంభువులకు పవిత్రధారణ, యాగశాలలో మహాపూర్ణాహుతి హోమంతో పరిపూర్ణం చేయనున్నారు. పాతగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో కూడా పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో హవనం, హోమం, అర్చనలు వంటి పూజాపర్వాలు చేపట్టారు. సాయంత్రం వేళ ఆలయ గోపురం మీదగల సుదర్శన చక్రానికి పవిత్రధారణ గావించారు. ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, ప్రధానార్చకుడు నల్లన్‌ధీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, ఆలయ డీఈఓ దోర్బల భాస్కర్, ఏఈఓలు జూశెట్టి కృష్ణ, గజవెల్లి రఘు పాల్గొన్నారు.



జాతీయ జెండా ఆవిష్కరణ సమయంలో దూరంగా ఉన్న తీన్మార్ మల్లన్న

# అంతటా 'బీర్ల' జాతీయ జెండా టాపిక్..!

- త్రివర్ణ పతాకం ఎగుర వేసేందుకు ప్రభుత్వ విప్‌కు నో ఛాన్స్
- ముఖ్య అతిథిగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి అవకాశం
- ఐలయ్యను జనగాం జిల్లాకు పంపించిన వైనం
- స్థానికుడైన విప్‌కు అవమానమే అంటూ చర్చలు

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ) : స్వాతంత్ర్య దినోత్సవం సమయాన జిల్లా అంతటా ఓ విషయంపై హాట్‌హాట్‌గా చర్చ నడిచింది. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జాతీయ జెండా ఎగురవేసే అంశంపై వివిధ వర్గాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు అవకాశం ఇవ్వకపోవడంపై చర్చోపచర్చలు జరిగాయి. భువనగిరి పట్టణంలో జెండా పండుగ కార్యక్రమంలో దీనిపై డిస్కషన్లు జరిగాయి. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు జాతీయ జెండా ఎగురవేసే అవకాశం దక్కలేదు. తొలిసారిగా గెలిచిన ఆయన కేబినెట్ ర్యాంక్ స్థాయిలో ఉన్నారు. అందరూ ఆయనే జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో త్రివర్ణ పతాకం ఎగురవేస్తారని తొలుత భావించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో జిల్లాలో ఆయన పేరు లేదు. అనూహ్యంగా ఆయన స్థానంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి అవకాశం కల్పించారు. అంతే కాకుండా బీర్ల ఐలయ్యకు జనగాంలో జాతీయ జెండా ఆవిష్కరించేందుకు ఛాన్స్ ఇచ్చారు. ఇదే విషయం జిల్లా అంతటా ఒక్కసారిగా హాట్ టాపిక్ అయ్యింది. దీంతో రెడ్ల పార్టీగా ముద్రపడిన కాంగ్రెస్ పార్టీలో బీర్ల ఐలయ్యకు అవమానం జరిగిందంటూ పెద్దఎత్తున ప్రచారం జరిగింది. ఇది బీర్ల ఐలయ్యను అవమానించడమేనంటూ జోరుగా చర్చ సాగింది. ఒక వేళ గుత్తా సుఖేందర్ రెడ్డికి అవకాశం కల్పించాలనుకుంటే యాదాద్రికి అతి సమీపంలో ఉన్న జనగాంలోనే ఇవ్వొచ్చని, కానీ అలా కాకుండా స్థానిక విప్‌ను జనగాం పంపడమేంటనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. ఐలయ్యకు అవకాశం ఇవ్వకపోవడంతో అసంతృప్తి చెందిన ఆయన అనుచరులు ఎవరూ హాజరుకాలేదు. కాగా అంతకుముందు ప్రభుత్వ విప్‌గా పనిచేసిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి వరుసగా జిల్లాలో జాతీయ జెండా ఆవిష్కరిస్తూ వచ్చిన విషయాన్ని అందరూ గుర్తు చేస్తున్నారు.

### జాతీయ జెండా ఎగురవేసేప్పుడు దూరంగా ఎమ్మెల్సీ

పంద్రాగస్టు వేడుకల సమయాన పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలకబూనారా...? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. గురువారం భువనగిరి పట్టణంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరయ్యారు. జాతీయ జెండా ఎగురవేసే సమయంలో మల్లన్న దూరంగా ఉన్నారు. ముందుగానే వచ్చిన మల్లన్న వీఐపీ సెక్టార్‌లో కూర్చున్నారు. చైర్మన్ విచ్చేసి మువ్వెన్నల జెండా ఆవిష్కరించే సమయంలో ఆయనతోపాటు ఎంపీ చామల, భువనగిరి ఎమ్మెల్యే కుంభంతోపాటు కాంగ్రెస్ నేతలు, ఇతరులు ఉన్నారు. తీన్మార్ మల్లన్న మాత్రం వాళ్ల దగ్గరికి వెళ్లకుండా వీఐపీ సెక్టార్ వద్దే ఉండటం కనిపించింది. అంతే కాకుండా మల్లన్న కాస్త ముభావంగా ఉన్నట్లు కనిపించింది. అంతకంటే ముందే చైర్మన్‌తోపాటు, ఎంపీ, ఎమ్మెల్యేను కలిసి వచ్చారు. ఆ తర్వాత కొనసాగిన కార్యక్రమంలో వేదికపైకి వెళ్లి ఆసాంతం అక్కడే ఉన్నారు.



నాగార్జునసాగర్ డ్యామ్ 6 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

# కొనసాగుతున్న సాగర్ నీటి విడుదల

- గురువారం ఉదయం 6 గేట్లు, సాయంత్రం 2 గేట్లు

నందికొండ, ఆగస్టు 15 : శ్రీశైలం నుంచి 95,578 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాతుండడంతో నాగార్జునసాగర్ డ్యామ్ 6 క్రస్ట్ గేట్ల నుంచి నీటిని విడుదల చేశారు. సాగర్ డ్యామ్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులకు ప్రస్తుతం పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉంది. బుధవారం డ్యామ్ 2 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను ప్రారంభించగా శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో పెరుగడంతో గురువారం గేట్ల సంఖ్యను 6కు పెంచారు. సాయంత్రం ఇన్‌ఫ్లో తగ్గడంతో 2 క్రస్ట్ గేట్ల ద్వారా 16,200 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఎడమ కాల్వ ద్వారా 7,518 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 8,023, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,948, వరద కాల్వ ద్వారా 600, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. సాగర్ మొత్తం 63,089 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అదే స్థాయిలో అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో నిండి ఉండడంతో మరికొన్ని రోజులు డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగే అవకాశం ఉందని ఎన్నెస్పీ అధికారులు చెబుతున్నారు.

# పట్నం నుంచి పల్లెబాట




చౌటుప్పల మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ

చౌటుప్పల రూరల్, ఆగస్టు 15 : వరుసగా సెలవులు రావడంతో హైదరాబాద్‌లో ఉంటున్న ప్రజలు పల్లె బాట పట్టారు. ఈ నెల 15న పంద్రాగస్టు, 16న వరలక్ష్మి వ్రతం, 18న ఆదివారం, 19న రాఖీ పౌర్ణమి ఉండడంతో ఉద్యోగులు, విద్యార్థులు సొంతూళ్లకు పయనమయ్యారు. దాంతో 65వ జాతీయ రహదారి విజయవాడ వైపు వచ్చే వాహనాలతో రద్దీగా మారింది. చౌటుప్పల మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద గురువారం ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో వాహనాల రాక కనిపించింది. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకున్నారు.

# సాగర్ వెనుక జలాల్లో ప్రకృతి రమణీయత

## రెండేళ్ల తర్వాత సమృద్ధిగా నీళ్లు

చందంపేట(నేరెడుగొమ్ము), ఆగస్టు 15 : సుమారు రెండేండ్ల తర్వాత నాగార్జున సాగర్ కొత్త అందాలు అద్దుకుంది. దాంతో ప్రాజెక్టు వెనుక జలాలు పెరిగాయి. నేరేడుగొమ్ము మండలంలోని వైజాగ్‌కాలనీ సమీపంలో నిండుగా కనిపిస్తున్న జలాలతో ప్రకృతి అందాలు పర్యాటకులకు కట్టిపడేస్తున్నాయి. నీళ్లు పుష్కలంగా ఉండడంతో మత్స్యకారులు జోరుగా చేపల వేట సాగిస్తున్నారు. సాగర్ నీళ్లు పెరుగడంతో నేరేడుగొమ్ము మండలంలోని వైజాగ్‌కాలనీ, బుగ్గతండా, సుద్దబాయితండా, చిన్నమునిగల్, పెద్దమునిగల్, తూర్పుతండా, మోసంగడ్డతండా, చందంపేట మండలంలోని గువ్వలగుట్ట, మంగళితండా, నక్క దుబ్బతండా ప్రజలు, మత్స్యకారులకు ఉపాధి దొరికినట్లయ్యింది. ఇక సాగర్ వెనుక జలాలను ఆనుకొని పంటలు సాగు చేసే రైతులకు కూడా నీటికి ఢోకా లేదు.



వైజాగ్ కాలనీ సమీపంలో సాగర్ వెనుక జలాల్లో చేపలు పడుతున్న మత్స్యకారులు